


# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

# చక్రధారిణి

హలో! నాకోసమేనా చూస్తున్నారు. ఇదుగో ఇక్కడ ఉన్నా... చాంతాడంత వరసలో రేవులో తాటిచెట్టంత వున్న ఆ తెల్లాయనకి, చింతాకు కళ్ళేసుకుని కూర్మావతారంలా వున్న చైనా బామ్మకీ మధ్యన. రండి రండి ...నాతో పాటు మీరు కూడా ఒక పూట నిలువు కాళ్ళేసుకుని నిల్చోవాల్సిందే మరి. మా ఊర్లో DMV (డిపార్ట్మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్) లైన్ అంటే కొండపైన లడ్డూ కౌంటర్ క్యూ మాదిరి. అక్కడికీ తెల్లారే లేచేసి ఇంత టిఫిన్ అయిందంటే అయిందనిపించా. బుడ్డదానికి మధ్యాహ్నం వరకూ కావలసినవి నాలుగు బాక్సుల్లో సర్ది, గంటకి అయిదు డాలర్లు తీస్కుని బేబీ సిట్టింగ్ ని ఒక కుటీర పరిశ్రమలా నడిపే ఆవిడ దగ్గర దింపి వచ్చా. ఎండ నడినెత్తిన వస్తోంది కానీ క్యూ కదులుతున్నట్టు లేదు, అసలు దేకుతున్నట్టు కూడా లేదూ. ఎక్కడైనా సర్కారు పనంటే ఇంతేనేమో. ఇప్పటికి నాలుగు సార్లు ఆవిడెవరో బయటికి వచ్చి సర్వర్లు డౌన్ అయ్యాయి, ఆలస్యానికి క్షమించండి అని

చెప్పి వెళ్ళింది. మంచి నీళ్ల సీసా కూడా తెచ్చుకోలేదు హడావిడిలో.  అమ్మలం అయితే చాలు ఎంతసేవు పిల్లల గురించే కానీ మన గురించి ఆలోచించం కదా! ఇంతకీ ఇప్పుడొచ్చిన కష్టం ఏంటంటే మన డ్రైవర్స్ లైసెన్స్ ఎక్స్పైర్ అయింది. రెన్యువల్ అయ్యేలోపు టెంపరరీ లైసెన్స్ తీసుకోడానికి అని వచ్చా.

నాకు తెలిసి అమెరికా వచ్చాక నేను చేసిన మొదటి మంచి పని ఏంటంటే డ్రైవింగ్ నేర్చుకోవడం. ఓ పట్టాన ఏదీ తేల్చని నేను వచ్చిన మూడు వారాల్లోనే రెక్కలు తెగిన జటాయువులా ఇంట్లో ఓ మూలకి కూర్చోవాలంటే విసుగేసి ఎలాగైనా చక్రం తిప్పాలని తీర్మానించుకున్నా. మరేం చేసేదీ, అటు ఇటూ ఎన్నేసి మైళ్ళు నడిచినా కావలసిన అంగడి ఒకటీ రాదు. ప్రతిదానికీ 'బాబ్బాబూ ఒక రైడ్ ఇప్పించండి ' అని దేహీ అంటూ అడుక్కోవలసిందే. ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోతే పోనీ, కొత్త దేశంలో ఎక్కడ ఏమిటి ఉంటాయనే కనీస జ్ఞానం లేనిది ఎందుకుట ఇక ఇన్నేసి సముద్రాలూ దాటి రావటం. తలుపులేసుకుని ఇంట్లో ఉండేపాటికి మా ఊరైతే ఏమీటీ, ఉత్తర అమెరికా ఖండం అయితే ఏమిటీ...బోడీ? అని డ్రైవింగ్ నేర్చేసుకుందామని కంకణం కట్టుకున్నాను.

కానీ హౌ? ఎలా?... కాస్త పరిశోధన చేసి నలుగురైదుగురు డ్రైవింగ్ నేర్పించే వాళ్ళకి కాల్ చేశా! గంటకి 75 డాలర్లు అని చెప్పారు. అందరూ ఒక ఐదు డాలర్లు అటు ఇటుగా ఒకే మాట. ఇప్పుడై తే కాస్త పర్లేదు కానీ, వచ్చిన కొత్తల్లో మరీ పచారీ కొట్లో కాలికులేటర్ లా పని చేస్తూనే ఉండేది బుర్ర. ప్రతీ దాన్ని అయితే 'ఇంటూ' డెబ్భై అనో లేదా 'డివైడెడ్ బై' డెబ్భై అనో గుణించి, విభజించి మనసులోనే బుగ్గలు నొక్కేసుకుని నోరు మూసేసుకునేదాన్ని. మనం పూర్వాశ్రమంలో సైకిల్ తప్పించి ఏ వాహనాన్ని తోలిన పాపాన పోలేదు. నా పెళ్ళికి తెచ్చిన అద్దె కారు తప్పించి పెద్దగా కార్లు షికార్లూ ఎరుగను. హాయిగా ఎంచక్కా రెండు జళ్లప్పుడు సైకిలు, ఒక జడప్పుడు సిటీ బస్సుల్లోనే తెల్లారిపోయింది చదువు. ఇక్కడ బస్సులు ఉన్నా బోలెడు టైంవేస్టు. కారు నడపడం రాకపోతే పాత తెలుగు నవలా నాయిక లాగా అలాగ అస్తమిస్తున్న సూర్యుని వైపు నడుచుకుంటూ పోతూనే ఉంటాము. దిగంతాలు దాటుతాము కానీ గమ్యం మాత్రం కానరాదు బాబోయ్.

నాకన్నా ముందే చదువుకోడానికని అమెరికా వచ్చిన ఫ్రెండ్స్ ని ఉపాయం అడిగా. స్టూడెంటుగా వచ్చిన వాళ్లకి తెలిసినంత బాగా 'డాలరు పూజా విధానం' ఇంకొకరికి తెలియదని నా గట్టి నమ్మకం. అర్ధరాత్రి లేపి అడిగినా డాలరు సేవా విధానంబులు విసుగూ విరామం లేకుండా టీకా తాత్పర్యంతో సహా చెప్పగలరు. వాళ్ళు ఎంచక్కా ఖాళీగా వున్న పార్కింగ్ లాట్ లోనే నేర్చేసుకునే వాళ్ళట వాళ్ళ కన్నా ముందు వచ్చిన సీనియర్స్ దగ్గర. బదులుగా నాలుగు అసైన్మెంట్లో, రెండు కూరలో చేసిపెట్టేవారుట.

చదువుకునే రోజుల్లో ఉండే వెసులుబాటు తర్వాత ఎక్కడ వస్తుంది చెప్పండి. ఇప్పుడు నాకున్న దిక్కూ దివాణం ఇతగాడొక్కడే కదా ఈ దేశంలో. ఏ కళన ఉన్నారో నేర్పించడానికి ఒప్పుకున్నాడు. అసలు యుద్ధ విమానాల ట్రైనింగ్ సెంటర్లు నడిపేవారు కూడా అంతలేసి బడాయిలు పోరు నన్నడిగితే. ఇది బ్రేకు, ఇది ఆక్సిలేటరు, ఇవి కంట్రోల్స్ అని ఓ--- శ్రీహరి కోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ లో పెద్ద సైంటిస్టు జూనియర్ సైంటిస్టులకి చెప్పినట్టు బేస్ వాయిస్ లో రెండు రోజులు 'కారు – దాని భాగాలు' మీద లెక్చర్ తీసుకున్నాడు. తరువాత ఖాళీగా ఉన్న ఒక మాల్ పార్కింగ్ లాట్ లో చిన్నగా కాసింత దూరం నడపగలిగాను. పర్వాలేదు అని ఇక ఇళ్ల మధ్యన 20 మైళ్ల స్పీడ్ రోడ్డు ఎక్కించాడు.

అసలు కట్టుకున్న వాళ్ళని పక్కన పెట్టుకుని డ్రైవింగ్ నేర్చుకోవడం అంత బుద్ధితక్కువ పని ఇంకోటి ఉండదు. వీళ్ళ కంగారు దొంగలు తోలా! లేనివి ఊహించుకుని అవసరమైనవీ లేనివీ చెప్పి కంగారు పెట్టించేసి, బీపీలు తెచ్చుకుని అరిచి కేకలేసి బాగా తోలేవాళ్ళని కూడా తికమక పెట్టి నానా రచ్చా చేస్తారు. అసలే మనకి ఇండియాలో ఎడమవైపు అయితే ఇక్కడ కుడి వైపు వాటం. లెఫ్ట్ దగ్గర ఈయన కంగారులో రైట్ అనడం నేను లెఫ్ట్ టర్న్ లైన్ నుండి రైటు తిప్పడం ప్రళయం వచ్చినట్టు ట్రాఫిక్ అంతా కంగారు పడి హారన్లు కొట్టడం జరిగిపోయాయి. ఈయన అరుపులు గోలలో ఎవడు ఏం చేస్కుంటే అది చేసుకోనీ అని తెగించి అడ్డదిడ్డంగా పక్కనే ఉన్న ఇళ్ల సందులోకి తీసుకెళ్లి ఆపేసాను. ఆహా! ఇక ఈయన ఎత్తుకున్నారు దండకం చూడండీ, జూనియర్లని రాగింగ్ చేస్తూ దొరికిపోయినప్పుడు మా ప్రిన్సిపాల్ దగ్గర కూడా అన్నేసి తిట్లు తినలేదు నేను. నిప్పులపైన కోతిలా ఒకటే గెంతులు. సీట్ మారి ఇంటికి చేరేదాకా కుంకుడుకాయల తలంటే.

ఐదో క్లాసులో సైకిలు నేర్చుకుంటూ కింద పడి మోకాలు మోచెయ్యి దోక్కుపోయి 'ఇక నేను నేర్చుకోను బాబోయ్' అంటే, రోజుకొక కోకాకోలా, పాప్పిన్స్ అక్కకి తెలీకుండా కొనిపించి మరీ నేర్పించాడు నాన్న. నాన్నలే మంచోళ్ళు వీళ్లకన్నా. ఇదే మాట అమ్మతో అంటే, "మీ నాన్న మంచితనం నన్నడుగు. మీ అయన మంచితనం నీ పిల్లని అడుగూ,"అంటుంది. బంతి అవతల కోర్టులో ఉంది కాబట్టీ, అవసరం మనది కాబట్టీ శిశుపాలుడి

వేషంలో రెచ్చిపోయి తిడుతున్న రాజనాలని నవ్వుతూ భరిస్తున్న పెద్దెంటీయారులాగా గోళ్లు చూసుకుంటూ ఉండిపోయా. ఇంకా పంతం పెరిగిపోయింది. మా ట్యూషన్ సైకిల్ పందేల్లో అబ్బాయిలతో పోటీగా సైకిలు తొక్కి నెగ్గినదాన్ని. కూరి కూరి కుట్టేసిన మినుములు బస్తా లాగా వచ్చే సిటీబస్సు కోసం మిడతల దండులా ఎదురు చూసే కాలేజి పిల్లలతో పాటు పోటీ పడి ఎక్కి సుబ్బరంగా మాక్సిమం అటెండెన్సుతో చదువులు ఊదేసినదాన్ని, వెధవ కారు నడపలేనుటండీ. ఇంకో మూడు నెలల్లో డ్రైవింగ్ టెస్ట్ పాసయ్యి లైసెన్స్ తెచ్చుకుని ఇంటర్ స్టేట్ 880 హైవే మీద ఈయన్ని పక్కనెక్కించుకుని బండిని పరుగులెట్టించక పోతే చూడు...అని అప్పటికప్పుడు శపథం చేశా.

అంతే ఇక ఈయనతో పెట్టుకుంటే లాభం లేదనీ ఒక డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్ ని మాటాడేసుకున్నాను. గంటకి డెబ్బై అయిదు డాలర్లని చెప్పి నా స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెట్టదలచుకోలేదు. ముందే కాసింత జ్ఞానం ఏడ్చింది కాబట్టి, ఒళ్ళు దగ్గరపెట్టుకుని ఒక క్లాసుతో ఇంటర్నల్ రోడ్లపైకి, ఇంకో రెండు క్లాసులతో హైవే ఎక్కేసాను. ఓపిగ్గా నేర్పించాడు మా ఇన్స్ట్రక్టరు. ముందుగా ట్రాఫిక్ రూల్స్ కి సంబంధించి ఆబ్జెక్టివ్ టెస్ట్ పాసయ్యి, తర్వాత డ్రైవింగ్ టెస్ట్ ప్రాక్టికల్ పాసయ్యి పర్మిట్ చేతికొచ్చిన రోజున నా సంతోషం అంతా ఇంతా కాదు. అదొక గొప్ప విజయం నాకు. నాకు నేనే స్టార్ బక్స్ వెళ్లి ఒక కాఫీ, చీజ్ డానిష్ తో సెలెబ్రేట్ చేసుకున్నాను.

"మనూర్లో నాయుడి కూతురు స్కూటీలో తిరుగుతోంది వాళ్ళ నాయనమ్మని ఎక్కించుకుని... నువ్వూ ఉన్నావ్ ఎందుకూ. ప్రతి ఏడూ వేసవికాలంతో పాటు రావడం మామిడి కాయల లెక్క తగ్గించి వెళ్ళిపోడం. నాకంత భాగ్యం లేదులే." అని దెప్పేది అమ్మమ్మ. ఒక్కసారి బయటికి వచ్చి ఆకాశం కేసి చూసి "అమ్మమ్మా! ఇటు చూడవే ఒకసారీ ...నాయుడి కూతురు మన ఊర్లోనే తిప్పింది బండి...నేను చూడవే ఇప్పుడు ఎంచక్కా అమెరికాలో తిప్పుతున్నా చక్రం. వస్తావా మరి ఒక రౌండు వేసొద్దాం?" అని అరవాలనిపించింది.

అబ్బా ...వెధవ లైను కదలి చావదేంటి? శోషొచ్చి ఇక్కడే పడిపోయేట్టు ఉన్నా. ఉండండి ఒక్కసారి డేకేర్ ఆవిడకి ఫోన్ చేసి పిల్లకి కాస్త పెరుగన్నం పెట్టమని చెప్తాను.

ఆ ఎందాకా చెప్పాను... డ్రైవర్స్ లైసెన్స్ వచ్చిందా! అప్పటినుండీ నాకు రెక్కలు వచ్చాయి. ఇక్కడి ప్రపంచంతో సంబంధం ఏర్పడింది. లైబ్రరీలు, పార్కులు, జిమ్ములు, డాన్స్ క్లాసులు, కాలేజీలకి దారులు ఏర్పడ్డాయి. ఇక్కడ స్వేచ్ఛకి టికెట్ దొరికింది. జాం జాం గా కారులో తిరుగుతుంటే ఆకాశం అంచులు తాకిన అనుభూతి. హైవే మీద వీడియో గేమ్ లో లాగా రయ్యి రయ్యిన ఆరేసి లేన్లలో దూసుకుపోతుంటే పద్మవ్యూహాన్ని చీల్చుకుని వెళ్లిన అభిమన్యుడిలాగా అనిపించేది. లాంగ్ డ్రైవుల్లో అటు ఇటూ రెండు కళ్ళకి పట్టనంత అందాల నడుమ స్వర్గానికి వెళ్లే దారిలా, బారుగా ఉండే అమ్మాయి జడలా ఉండే రోడ్డుపై దూసుకుపోయే అవకాశం వదలగలమా? అత్తయ్య మామయ్య అమెరికా వచ్చినపుడు ఎయిర్పోర్ట్ కెళ్ళి నేనే ఇంటికి తీస్కొచ్చినప్పుడు విజయవంతంగా చంద్రమండలంపై రాకెట్ లాండైనంత గర్వం. "అమ్మా! అమెరికా లో నీకేం నచ్చిందే?" అనడిగితే..."మిగతావన్నీ ఏమో గానీ నూ కారు నడుపుతుంటే నీ పక్కన కూర్చుని అమెరికా చూడడం బాగుందే బాబూ! " అని అమ్మ అన్నప్పుడు అమాంతం మౌంట్ శాస్తా అంత ఎత్తు ఎదిగిన ఫీలింగు.

విశాలమైన దేశం. ఒక్క ఎగ్జిట్ తప్పినా వేరే ఊరు వెళ్ళిపోతాము. అసలు గూగుల్ మ్యాప్స్ పెట్టుకుని కూడా అప్పుడప్పుడు ఏ అడవుల్లోకో, చెట్లలోకో పుట్లలోకో వెళ్లిపోతుంటాం కదా! ఇవన్నీ లేనప్పుడు ఎలాగ వెళ్లేవారబ్బా అని ఆశ్చర్యపడిపోయేదాన్ని. అలాంటిది ఇప్పుడు నేను నడపగలను అన్నప్పుడు ఎంత ధైర్యంగా అనిపించిందో. అందుకే కొత్తగా అమెరికా వచ్చిన వారికి చెప్తుంటాను అర్జెంటుగా డ్రైవింగ్ నేర్చుకోమని. ఇక్కడ అన్నిటికీ సిద్ధంగా ఉండాలి కదా మరి. ఎమెర్జెన్సీలప్పుడు, ఇండియా నుండి పెద్దాళ్ళు వచ్చినప్పుడు, స్నేహితులని ఇష్టమైన వారిని కలవాల్సినప్పుడు, మనకంటూ కాస్త సమయం గడపాల్సినప్పుడు మనల్ని ఆదుకునేది ఈ చక్రమే మరి. అదిచ్చే ఆత్మవిశ్వాసం అంతా ఇంతా కాదు.

కానీ ప్రతీ దానికి ఇంకో వైపు ఉంటుంది కదా! ఒక్కోసారి విసుగు వస్తుంటుంది లెండి. ఇదుగో ఇలా dmv ఆఫీస్ ముందు ఎండలో పగలంతా నిల్చున్నప్పుడు ఎక్కడ లేని నీరసం వస్తుంటుంది. వెధవ డ్రైవింగ్ నేర్చుకోకపోయినా బాగుండు, హాయిగా ఇంట్లో కాలు మీద కాలు వేస్కుని కూర్చునే దాన్ని. నేర్చుకున్నప్పటినుండీ పిల్లల్ని స్కూళ్ళకి దింపి తీస్కుని రావడాలూ, పచారీ కొట్లకి తిరగడాలూ, హాస్పిటళ్ళకి తిప్పడాలూ, రెంట్లు డ్రాప్ చెయ్యడాలూ మరీ ఛాఫర్ ఉద్యోగం అయిపోయింది అనిపిస్తుంది. ఒక్కోసారి ఇంటికీ, పిల్లలకీ, ఆఫీసులకి మధ్య సమయాన్ని బ్యాలన్స్ చేస్తూ తిప్పలేక సరాసరి కారుని పసిఫిక్ సముద్రంలోకి తీసుకెళ్లి ముంచేద్దాం అనిపిస్తుంది ఈ హడావిడి ప్రపంచంలో.

దీనికి తోడు ఈ మధ్య ఇండియా నుండి ఒకటే విరుపులు. సోషల్ మీడియాలో వీడియోలు చూసెయ్యడం, "మీ ఇంటికి మీరే వంట మనిషి, పని మనిషి, డ్రైవరు అటగా, లగ్జరీస్ అనేవే లేవటగా, అన్నిటికీ గీసి గీసి బతకాలటగా." అని ఓ... నస. అరె! ఎవడింటికి వాళ్ళు చాకిరీ చేసుకోవడం కూడా పెద్ద నేరమా? ఇండియాలో తుడిచిపెట్టుకుపోతోన్న మధ్య తరగతిని ఇక్కడ మేము కొనసాగిస్తున్నాము అంతే. అత్తలు, వదినలూ ఎన్ని విసుర్లు విసిరినా పుట్టింటి పైన మమకారం పోతుందా? ఇక్కడికి వలస వచ్చినందుకు ఎన్ని సెటైర్లు మాపైన వేసినా, కథల్లో సినిమాల్లో తల్లితండ్రుల్ని వదిలేసిన పాత్రలన్నింటికీ NRI ట్యాగులు అటించినా పుట్టిన దేశంపై మా ప్రేమా తరగదు! అదంతే. మార్పు వెంటే పయనం కదా ఆది నుండి. లేదు ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండి ఉద్దరించాలి అంటే మనమంతా మళ్ళీ ఆకులు చుట్టుకుని ఆదిమానవుడిలా గుహల్లోకి వెళ్లిపోవలసిందే. కాదా?

హమ్మయ్య మాటల్లో వైకుంఠ ద్వారం వచ్చేసింది. నెక్స్ట్ నేనే ఇక. నా పర్మిట్ నాకు వచ్చేస్తే ముందు అర్జెంటుగా ఈ ఊబర్ డ్రైవర్ల నస పోరు తగ్గుతుంది బాబూ. గతిలేక టాక్సీలు ఎక్కితే చాలు ఎదురు చార్జీలు ఇవ్వడమే కాక "మా తాతలు ముగ్గురు..." అంటూ వీళ్ళు చెప్పే చరిత్ర అంతా విని తల బొప్పికట్టించుకునే బాధ తప్పుతుంది ముందైతే.

880 మీద ట్రాఫిక్ లో చిక్కుకుపోయినా, పిల్లని స్కూళ్ళకి, క్లాసులకి, హాస్పిటళ్ళకి తిప్పలేక విసుగేసినా సరే నా చేతిలో ఈ సుదర్శన చక్రాన్ని మాత్రం వదలను. డ్రైవింగ్ అనేది నా అమెరికా జీవన పోరాటం లో నాదగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం. ఇది ఉంటే వీజీగా ఈదేస్తాను అమెరికా భవసాగరం. ఆల్రెడీ రణ రంగంలో సత్య భామల్లా స్వయం సారథ్యంలో పోరు సాగిస్తున్న భామలకి జేజేలు. ఇప్పుడిప్పుడే అమెరికా వచ్చి ఇంతలేసి కళ్ళతో "మీకు డ్రైవింగ్ వచ్చా?" అని అడిగే స్టిల్ ఇన్నోసెంట్ చిలకమ్మలకి "ఆల్ ది బెస్టు" దీవెనలు. ఇహ చక్రం తిప్పడమే ఆలస్యం మరి!!

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments